ఆశల వరి

వరికి అధిక ధర లభిస్తుండటంతో ఖరీఫ్‌లో పండిన పంటనంతా రైతులు వెంటనే విక్రయించారు. అలాగే రబీలో మినుము, మొక్కజొన్న తదితర ఇతర పంటలు వేసేవారు. మార్కెట్‌లో వడ్ల ధర మరింత పెరగడం, నీరు సమృద్ధిగా పారుతుండటంతో రెండో పంటగా వరినే సాగు చేస్తున్నారు. సాధారణంగా జనవరి మొదటి వారంలోపు నాట్లు పూర్తయ్యేవి. ఈ ఏడాది మాత్రం నాట్లు ఇంకా కొనసాగుతుండటంతో నారుకు డిమాండ్ నెలకొంది. గిట్టుబాటు ధర కారణంగా గతంలో ఎన్నడూ లేనట్లుగా గోదాముల్లో ధాన్యం నిల్వ లేకపోవడం విశేషం.

- భారీగా పెరిగిన వడ్ల ధర
- ప్రస్తుతం 75 కేజీల బస్తా రూ.2,100
- ఎన్నడూ లేనట్లుగా ఇళ్లు, గోదాముల్లో ధాన్యం నిల్వలు నిల్
- రబీలో రెట్టించిన ఉత్సాహంతో సాగు
- ఇంకా కొనసాగుతున్న నాట్లు
- నారుకు పెరిగిన డిమాండ్


వరినారును ఆటోలోకి చేర్చుతున్న కూలీలు


చిత్రేనిపల్లె వద్ద వరి నాట్లు వేస్తున్న కూలీలు


ట్రాక్టరులో తరలిపోతున్న వరి ధాన్యం

రుద్రవరం: రెండేళ్లుగా వరి సాగు అంటే రైతులు విముఖత చూపేవారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటే దిగుబడులు వచ్చే సమయంలో విపత్కర పరిస్థితులతో పంటంతా నేలపాలయ్యేది. ఖర్చులు లెక్క చెయ్యక కోతలు కోయించి విక్రయించే సమయంలో గిట్టుబాటు ధరలు ఉండేవి కావు. ఎరువుల ధరలు అధికం, ధాన్యానికి అరకొర ధర కారణంగా నష్టాలు మిగిలేవి. మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో వరి సాగు కొంతమేర తగ్గింది. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ అనుకూలించడం రైతుల్లో ఉత్సాహం నింపింది. మంచి దిగుబడి, ధాన్యానికి ధర బాగా లభించడంతో లాభాలు గడించారు. రబీలో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని భావించిన రైతులు వరి నాట్లు ఇంకా కొనసాగిస్తున్నారు.

పుష్కలంగా నీరు..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కంటే రుద్రవరం మండలంలో సాగు నీటి వనరులు అధికం. 16 చెరువులు, 16 కుంటలు, తెలుగుగంగ కాల్వలు, వక్కిలేరు వాగు, గండ్లేరు జాలాశయం, అడుగడుగునా బోరు బావులు ఉన్నాయి. దీంతో మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో రైతులు ఏటా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 8 వేల హెక్టార్లలో వరి సాగు చేసేవారు. ఇందుకు ఎకరాకు దాదాపు రూ.30వేల వరకు ఖర్చయ్యేది. చివరకు 35 బస్తాలు (75కేజీలు) దిగుబడులు వచ్చేవి. అయితే అప్పట్లో బస్తా ధర రూ.వెయ్యి నుంచి రూ.1200 లోపు ఉండేది. దీంతో వచ్చిన మొత్తం ఖర్చులకే సరిపోయేది. రెండు మూడేళ్ల నుంచి వాతావరణం అనుకూలించక పోవడంతో రైతులు బాగా నష్ట పోయారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు దాదాపు 7వేల హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో ఎకరాకు 45 బస్తాల వరకు దిగుబడులు వచ్చాయి. ధాన్యం పసిమి ఉండగానే బస్తా (75 కేజీలు) రూ.1500 ప్రకారం కొనుగోలు చేశారు. అయితే అప్పటికే మంచి ధర అయిన కొందరు విక్రయించారు. మరి కొందరు ఇళ్ల,గోదాముల్లో నిల్వ చేసుకున్నారు. నిల్వ చేసుకున్న రైతుల పంట పండింది. ప్రస్తుతం ఒక్కో బస్తా రూ.2100 పలుకుతుండటంతో నిల్వ ఉంచి ధాన్యాన్ని విక్రయించేశారు. దీంతో రెండో పంటలో కూడా మంచి లాభాలు గడించవచ్చనే ఆశతో రబీలో ముమ్మరంగా వరి సాగు చేశారు.

నారుకు భలే డిమాండ్..

ఖరీఫ్‌లో సాగు నీరు సమృద్ధిగా ఉన్న చెరువుల కింద కూడా వరి సాగు చేయని రైతులు.. మంచి ధర లభిస్తుండటంతో రబీలో భాగంగా వరి సాగుకు పూనుకున్నారు. ఖరీఫ్‌లో మినుము,మొక్కజొన్న,పత్తి, మిరప వంటి పంటలు సాగు చేసిన రైతులు కూడా రెండో పంటగా వరి సాగుకు ట్రాక్టర్లతో బురద సేద్యం చేయించి నారు కోసం పక్క గ్రామాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో ఒక్క సెంటు నారు రూ.వెయ్యి నుంచి రూ.1400 వరకు పలుకుతోంది. అయినా అన్నదాతలు వెనుకాడకుండా కొనుగోలు చేసి తెచ్చి నాట్లు వేయిస్తున్నారు. అలాగే నాటు వేయడానికి ఎకరాకు రూ.5వేల వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సమానంగా దాదాపు 6వేల హెక్టార్ల వరకు వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

నష్టాల నుంచి గట్టెక్కాం



మూడేళ్లుగా దొర్వి నరసింహ స్వామి ఆలయం వైపు ఉన్న మూడెకరల్లో వరి సాగు చేస్తూ నష్టాల్లో కూరుకుపోయాం. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ అనుకూలించింది. మంచి దిగుబడులు రావడం, ధర కూడా బాగా లభించింది. దీంతో నష్టాల నుంచి గట్టెక్కాం. ప్రస్తుత ధరను చూసి రబీలో కూడా వరి సాగు చేశాం. – సొదన్న,రైతు రుద్రవరం

అందుబాటులో ఎరువులు



ఖరీఫ్ వరి రైతులకు మంచి ఫలితాలు ఇచ్చింది. దీంతో రబీలో కూడా లాభాలు గడించాలని జనవరి ముగుస్తున్నా ఇంకా నాట్లు వేస్తున్నారు. వారికి తగ్గట్టుగా మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని ఆర్‌బీకేల్లో యూరియా, డీఏపీ వంటి ఎరువులు అందుబాటులో ఉంచాం. రైతుల డిమాండుకు తగ్గట్టుగానే ఎరువుల కొరత లేకుండా చేశాం. అలాగే బయటి దుకాణాల్లోనూ అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నాం. – జ్యోతి,వ్యవసాయాధికారి,రుద్రవరం

గిడ్డంగులు ఖాళీ.. : ఖరీఫ్ పంటలు సంక్రాంతి పండుగ నాటికి దిగుబడులు రైతుల ఇళ్లకు చేరేవి. వచ్చిన దిగుబడుల్లో నుంచి ఏడాది పాటు గృహ వినియోగానికి సరిపడ ధాన్యాన్ని మిగిల్చుకొని మిగిలినవి విక్రయించుకునేవారు. ఈ ఏడాది మాత్రం ధర అధికంగా లభిస్తుండటంతో ఇంటి అవసరాలకు కూడా ఉంచుకోకుండా నిల్వ ఉంచి ధాన్యాన్ని కూడా విక్రయించి లాభాలు చూశారు.దీంతో ఇళ్ల,గోదాముల్లో నిల్వలు లేకుండా పోయాయి. గతంలో ధాన్యానికి సరైన ధరలు లేక నెలల తరబడి గోదాముల్లో నిల్వ చేసుకునేవారు. ఆలస్యమైతే గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకునేందుకు స్థలం కూడా లభించేది కాదు.

క్లుప్తంగా

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, అక్కంపల్లె, ఇంజేడు, కొండుపల్లె ఫీడర్ల కిందన్ను గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): స్థానిక మెయిన్‌బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రెండో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు చేపట్టి రుద్రాక్ష పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీ వాసవీ సామూహిక వ్రతం నిర్వహించారు. చివరగా మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు భవనాసి వాసు, శేషాద్రి, మహిళా మండలి అధ్యక్షురాలు ఇందుమతి, శోభారాణి పాల్గొన్నారు.

చిన్నారులకు సన్మానం


చిన్నారులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పల్నాడు జిల్లా వినుకొండలో బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖన ప్రదర్శన పోటీల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించిన చిన్నారులను ఆదివారం స్థానిక అకాడమీలో నిర్వాహకులు చింతలపల్లె కోటేష్ ఆధ్వర్యంలో సన్మానించారు. కోటేష్ మాట్లాడుతూ ప్రథమ బహుమతి సాధించిన హేమకేష్‌కు నిర్వాహకులు రూ.2వేల నగదు, ప్రశంసా పత్రం, ద్వితీయ స్థానంలో మంజునాథ్ నిలిచాడు. సాహిత్, అస్మిత్ గోల్డ్ మెడల్స్, వాసుశ్రీ, మాన్యా సిల్వర్ మెడల్స్ దక్కించుకున్నారని వివరించారు.

తప్పెట కళాకారులను ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): అంతరించి పోతున్న డప్పు కళ పునరుజ్జీవం పొందాలంటే తప్పెట కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి రవిరాజ్ కోరారు. పట్టణంలోని డప్పు కళాకారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. గాలి రవిరాజ్ మాట్లాడుతూ 45 ఏళ్లు నిండిన డప్పు కళాకారుల కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కళాకారులందరికీ ఉచితంగా డప్పులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కళాకారులు మద్దయ్య, సుబ్బరాయుడు, ఏసన్న, నాగన్న పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

నంద్యాల(సిటీ): కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరిస్తే అడ్డుకుంటామని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 23,24 తేదీల్లో జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల వద్ద దీక్షలు, 25న కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష, 27న విశాఖ పట్టణంలో మహాగర్జన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా మహా గర్జనకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఏఐటీయూసీ నాయకులతో కలిసి స్థానిక కార్యాలయంలో విడుదల చేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలనుకోవడం దుర్మార్గమన్నారు. నాయకులు సుబ్బరాయుడు, కలాం, అన్వర్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

నంద్యాల(అర్బన్): ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని ఇన్‌చార్జ్ ఆర్టీఓ శ్రీకాంత్ కోరారు. 34వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక రామకృష్ణా డిగ్రీ కళాశాల ఆవరణలో రహదారి భద్రత- జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు రోడ్డు బద్రతా నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యం చేరుకోవాలని సూచించారు. నిబంధనలు విరుద్ధంగా వ్యవహరించే వారిపట్ల చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యార్థులు అతి వేగంతో ద్విచక్ర వాహనాలను నడుపరాదన్నారు.రామకృష్ణా రెడ్డి, ఎంవీఐ రవిశంకర్‌నాయక్, ఏఎంవీఐ నాగేంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభిమానుల సంబరాలు



నంద్యాల(అర్బన్): వాల్తేరు వీరయ్య సినిమా నంద్యాలలో రూ.50లక్షల షేర్ సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని సినీ నటుడు చిరంజీవి అభిమానులు లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్రావణ్‌కుమార్, ప్రసాద్, వలి పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్సీ గంగుల ప్రత్యేక పూజలు..

ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, నాయకులు కృష్ణారెడ్డి, జాకీర్, రఫీ, శాంతయ్య, మద్దిలేటి, డీలర్ పెద్దన్న, కరీముల్లా, శివారెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.


పెద్దమ్మ సన్నిధిలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి దంపతులు

కేసీ కాల్వకు 1,640 క్యూసెక్కుల నీరు

జూపాడుబంగ్లా: కర్నూలు-కడప కాల్వకు 1,640క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాంలో 1.2 టీఎంసీల నీటిమట్టం ఉండగా డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,400 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం ఓ మోటారు ద్వారా 240 క్యూసెక్కుల నీటిని కాల్వకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 400 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.


కేసీ కాల్వలో పారుతున్న సాగునీరు

ఘనంగా సంఘమిత్ర వార్షికోత్సవం



మాట్లాడుతున్న విజయసారథి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంఘమిత్ర బాలు ఆవాస కేంద్రం 29వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం స్థానిక ప్రథమ నంది కేంద్రంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సమన్వయకర్త వడ్డి విజయసారథి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం సంఘమిత్ర సేవా సమితి వారు చేపట్టిన వివిధ ఛాయా చిత్రాలను ప్రదర్శించారు. సంఘమిత్ర అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు సంఘమిత్ర చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం సంఘమిత్ర ఆవాస యోగా కేంద్రం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రామకృష్ణారెడ్డి, డాక్టర్ సహదేవుడు, డాక్టర్ భార్గవ్‌వర్ధన్‌రెడ్డి, డాక్టర్ సత్యశివసుందరి, శివశంకర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, మురళీధర్, డాక్టర్ ఆదినారాయణ, వాసు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులతో జాగ్రత్త

నంద్యాల(వ్యవసాయం): మూత్రపిండాల జబ్బుల పట్ల అప్రమత్తత అవసరం అని యూరాలజీ నిపుణులు డాక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, కీర్తిరెడ్డి అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలాజీ కిడ్నీ కేర్ ఆసుపత్రిలో ఆదివారం మూత్రపిండాల అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మూత్రపిండాల శస్త్ర చికిత్సలపై జాగ్రత్తలను మల్టీ మీడియా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ మూత్రపిండాల శస్త్ర చికిత్సలో వస్తున్న మార్పులను ఆధునిక విధానాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అనంతరం వైద్యులను సన్మానించారు. నంద్యాల అధ్యక్షుడు డాక్టర్ జఫ్రుల్లా, కోశాధికారి డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

నమ్మకమైన వైద్యం ఆయుర్వేదం


మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): అనాదిగా ఆయుర్వేద వైద్యం నమ్మకమైందిగా పేరుగాంచిందని, ఈ విధానంలో ఎలాంటి ప్రతికూలతలు ఉండవని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. శిరిగిరి వెంకప్ప ఆయుర్వేద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్యామ్ విద్యావిహార్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో వారు మాట్లాడారు. దీర్ఘకాలిక జబ్బులకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయన్నారు. ప్రకృతి ఆధారంగా తయారు చేసే ఈ మందులను ఎవరైనా ఉపయోగించవచ్చని చెప్పారు. అనంతరం వైద్యులు రోగులకు ఉచితంగా మందులు అందజేసి పలు సూచనలు చేశారు.నిర్వాహకులు శిరిగిరి రమేష్, డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ సహదేవుడు పాల్గొన్నారు.

అర్హత ఉంటే టీడీపీకి ఓటు వేసినా పథకాలు

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- నల్లగట్లలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గ్రామం	నల్లగట్ల
మొత్తం గృహాలు	881
లబ్ధి పొందిన కుటుంబాలు	825
ఒక్క పథకం పొందిన కుటుంబాలు	321
రెండు పథకాలు పొందిన కుటుంబాలు	303
మూడు పథకాలు అందుకుంటున్న కుటుంబాలు	127
నాలుగు పథకాలు పొందిన కుటుంబాలు	56
ఐదు పథకాలతో లబ్ధి పొందిన కుటుంబాలు	14
ఆరు పథకాలు అందుకుంటున్న కుటుంబాలు	4


ఇక్కడ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో మాట్లాడుతున్న ఈమె నల్లగట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బొమ్మిరెడ్డి భార్య సుకన్య. వీరికి వైఎస్సార్ పంటల బీమా కింద రూ.18,307, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.25,050, వైఎస్సార్ సున్నా వడ్డీ (రైతులు) రూ. 4,412, వైఎస్సార్ రైతు భరోసా రూ.50,000 మొత్తం రూ 97,769 నేరుగా వీరి ఖాతాలో జమైంది.

ఆళ్లగడ్డ: టీడీపీకి ఓటు వేసినా అర్హులని తేలితే తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. ఇందుకు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అందిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించడంతో వారి కుటుంబ సభ్యులు అవునని సమాధానమిచ్చారు. మండలంలోని లోని నల్లగట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు తమకు.. వివిధ పథకాల ద్వారా రూ.లక్షల్లో అందిందని స్వచ్ఛందంగా, సంతోషంగా వెల్లడించడం విశేషం. గ్రామంలో మొత్తం గృహాలు 881 ఉండగా 825 ఇళ్లకు సంక్షేమ పథకాలు అందాయి. దీంతో గ్రామంలో 93 శాతం ఇళ్లు పథకాలతో ప్రయోజనం పొందాయి. ముందుగా గ్రామంలోకి చేరుకున్న ఆయనకు స్థానికులు, నాయకులు ఆనందోత్సాహాలతో పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం తమకు సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాలు ఇంటి దగ్గరకే వచ్చి అందజేస్తున్నారని వెల్లడించడం గమనార్హం. ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతుంటే ప్రతి పక్షాలు కళ్లుండి చూడలేని కబోదుల్లా మాట్లాడుతుంటే ప్రజలు ఛీదరించుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎంఈఓ శోభావివేకవతి, ఏఈలు రామకృష్ణనాయక్, కమాల్‌బాషా, సర్పంచ్ రామకృష్ణయ్య, నాయకులు భాస్కర్‌రరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం 17 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో మొదటి రోజు మహా సంకల్పం, అంకురార్పణ, ధ్వజారోహణ, గోపూజ, పంచామృతాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం చేశారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, కమిటీ సభ్యులు మురళి కల్కూర, ఉమేష్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

28న ఆత్మీయ ధార్మిక సమ్మేళనం

కర్నూలు కల్చరల్: శ్రీ లలితా పీఠం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆత్మీయ ధార్మిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ స్వామి తెలిపారు. పలువురు పీఠాధిపతులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొని సందేశం ఇస్తారని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

నంద్యాల మార్కెట్ యార్డు నూతన కమిటీ నియామకం

నంద్యాల అర్బన్: నంద్యాల మార్కెట్ యార్డు నూతన కమిటీని ప్రభుత్వం నియమించింది. యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శేషిరెడ్డి ఆధ్వర్యంలో యార్డు చైర్మన్‌గా పోలూరు మహేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్‌గా నాగన్న ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 30న చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, మెంబర్‌లుగా మునయ్య, వెంకటేశ్వర రెడ్డి, షేక్ సత్తార్, దిలీప్‌కుమార్, కత్తిశంకర్, లక్ష్మీప్రసన్న, రామేశ్వరమ్మ, లింగమ్మ, షేక్ కౌసర్, హైమావతి, కృష్ణమూర్తి, చక్రవర్తి, మమతను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ చౌదరి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆదివారం మంచి రోజు కావటంతో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. ఈనెల 30న కార్యవర్గంతో కలిసి ప్రమాణస్వీకారం చేస్తామని, కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారని వివరించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శిల్పా రవికి ధన్యవాదాలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్వర రెడ్డి

డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గడివేముల: ఆటో,ట్రాలీ డ్రైవర్లకు ప్రత్యేకంగా సంక్షేమం బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల వెంకట్ కోరారు.ఆదివారం మండల కేంద్రం గడివేములలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో సీఐటీయూ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ నాయకులు మాట్లాడుతూ నిత్యవసర ధరలను అదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, షేక్ బాబు, శివుడు, అస్లాంబాష, నారాయణ, ప్రభాకర్, పెద్దన్న సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి

సంప్రదాయ పంటల్లో ఆశించిన మేరకు లాభాలు రాకపోతుండటం, ప్రత్యామ్నాయ పంటలు వేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనల మేరకు మండలంలో కొందరు రైతులు వాణిజ్య పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, కాకరవాడ, ఒంటెద్దుపల్లె, సర్వాయిపల్లె గ్రామాల పరిధిలో వరికి బదులు కొర్రలు, సజ్జలు, నువ్వుల పంటలు సాగు చేశారు. వైద్యాధికారులు సైతం షుగర్ వ్యాధిగ్రస్తులకు కొర్ర మంచి ఆహారం అని సూచిస్తుండడంతో మార్కెట్‌లో వాటికి డిమాండ్ పెరిగింది. పైగా రబీలో రెండో పంట వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేస్తే తక్కువ సమయంలో 60- 70 రోజుల వ్యవధిలోనే దిగుబడులు అందుతాయని ఆయా గ్రామాల్లో పంటలు సాగు చేశారు. – ఉయ్యాలవాడ

పెద్దయమ్మనూరు సమీపంలో సాగైన కొర్ర పైరు
